రాష్ట్రం ఉరవకొండా

మనదే..!

■ రా.. కదలిరా సభలో ఎమ్మెల్యే పయ్యావుల



గుంతకల్లు/ఉరవకొండ, జనవరి 27: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ విజయం తథ్యమని, ఉరవకొండలోనూ తాను విజయబావుటాను ఎగురవేయడం ఖాయమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణ శివారులో శనివారం ఏర్పాటు చేసిన 'రా.. కదలిరా..' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉరవకొండలో జన సునామీ మొదలైందని అన్నారు. ఈ సభ ఒక చారిత్రాత్మక ఘట్ట మని అన్నారు. తాను రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 30 ఏళ్లు అయ్యిందని అన్నారు. 1994లో రాష్ట్రంలో టీడీపీకి, ఉర వకొండలో తనకు ఘన విజయం లభించాయని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో తాను 18 వేల పైచిలుకు మెజార్టీ సాధించానని అన్నారు. చరిత్ర పునరావృతం అయ్యి తీరుతుందని అన్నారు. ఈ 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలకు చేరానని, రాష్ట్రవ్యాప్త గుర్తింపు పొందానని, తన జీవితాన్ని ప్రభావితం చేసిన అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. తనకు లభించిన గుర్తింపు, గౌరవం చంద్రబాబు నాయుడి చలువేనని అన్నారు. చంద్రబాబు యూనివర్సిటీలో తాను శిక్షణ తీసుకున్నానని అన్నారు. ఆయన ఏ సర్టిఫికెట్ ఇస్తారో చూడాలని, బహూశా పీహెచ్‌డీ ఇస్తారేమోనని చమత్కరించారు.

ఎవరు కావాలి..?

సీఎం జగన్‌పై, వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నీళ్లు ఇచ్చే నాయకుడు కావాలో, జే ట్యాక్స్ డబ్బులతో ఉత్తుత్తి బటన్ నొక్కే జగన్ కావాలో నిర్ణయించుకోవాలని ఓటర్లకు సూచించారు. జిల్లాలో ఎక్కడ చూసినా టీడీపీ జెండా తప్ప మరో జెండా కనిపించని విధంగా తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన జిల్లాకు నీరు ఇస్తే తమ తలరాతలు మారతాయని, రత్నాలు పండుతాయని అన్నారు. జీబీసీకి నీటి సరఫరా ఆగిపోవడం వల్ల రైతులకు రూ.300 కోట్లు నష్టం జరిగిందని అన్నారు. ఈ పాపం వైసీపీది కాదా అని ప్రశ్నించారు. 2016లో ఇలాంటి పరిస్థితే ఉత్పన్నమైతే, హంద్రీనీవా నుంచి జీబీసీకి నీరు మళ్లించి పంటలను కాపాడామని గుర్తు చేశారు. రైతుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని అన్నారు.

చేతగాని దద్దమ్మ విశ్వ

అసమర్థ, చేతకాని దద్దమ్మ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి అని కేశవ్ విమర్శించారు. ఉరవకొండ వెనుకబాటు తనానికి ఆయనే కారణమని అన్నారు. ఐదేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. టీడీపీ హయాంలో నియోజకవర్గానికి 18 వేల ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ఐదేళ్లలో కాలవలో తట్టెడు మట్టి కూడా తీయలేకపోయారని విమర్శించారు. వైసీపీని ఓడించడానికి మహిళలు, రైతులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆమిద్యాల లిఫ్ట్, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌లు చేపడతామని హామీ ఇచ్చారు. ఉరవకొండలో చేనేత కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని, గార్మెంట్స్ పరిశ్రమను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు.

రా.. కదలిరా సూపర్ సక్సెస్

ఉప్పొంగిన ఉరవకొండ



వైసీపీ పాలనపై సమర భేరి మోగిస్తూ.. ఐదేళ్ల దురాగతాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా.. కదలి రా సభకు జన సునామీ పోటెత్తింది. 'మీరు పిలిస్తే రాకుండా ఉంటామా..' అన్నట్లుగా వేలాది మంది స్వచ్ఛందంగా ఉవరకొండ సభకు ఉత్సాహంగా వచ్చారు. చంద్రబాబును చూడగానే మహిళలు, యువతులు సైతం ఈలలు, కేకలతో కేక పుట్టించారు. జగన్ మాయ మాటలను నమ్మి ఓట్లేసినందుకు రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని, ఇంకో అవకాశం వారికిస్తే సర్వనాశనం తప్పదని చంద్రబాబు హెచ్చరించారు. మరో ఇరవై ఏళ్లలో తెలుగువారిని ప్రపంచంలో నంబర్ వన్ చేయాలన్నదే తన లక్ష్యమని, అందుకు సహకారం అందించాలని ప్రజలను కోరారు. తన గుండెకు దగ్గరగా ఉన్న జిల్లా అనంతపురం అని ఉద్వేగంగా ప్రసంగించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని, జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగు నీరు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల జోలికి వచ్చే వైసీపీ వారిని ఊరికే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

(వివరాలు 5లో...)

- వైసీపీ పాలనపై విరుచుకుపడ్డ చంద్రబాబు
- టీడీపీ-జనసేన కూటమిదే అధికారమని ధీమా
- అనంతలో ప్రతి ఎకరానికీ నీరిస్తానని హామీ

రాయలసీమ ద్రోహి జగన్: కాలవ

రాయలసీమ ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. టీడీపీ హయాంలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. వైసీపీ పాలనలో అరాచకం, విధ్వంసం కొనసాగిందని అన్నారు. ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కొన్నామని అన్నారు. జగన్ దుర్మార్గపు పరిపాలన నుంచి ప్రజలు విముక్తిని కోరుకుంటున్నారని, చంద్రబాబు నాయుడు ఎప్పుడు ప్రమాణస్వీకారం చేస్తారా? అని ఎదురుచూస్తున్నారని అన్నారు. చంద్రబాబు పరిపాలనలో రాష్ట్రం, రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని అన్నారు.





ప్లకార్డులతో విన్నవిస్తున్న బీమామిత్రలు

మా బతుకులు బజారున పడ్డాయి..

సీఎం జగన్ చర్యలతో తమ బతుకులు బజారున పడ్డాయని చంద్రన్న బీమా మిత్రలు వాపోయారు. ఉరవకొండలో నిర్వహించిన 'రా.. కదలి రా' సభకు వారు ప్లకార్డులు చేతపట్టుకుని వచ్చారు. 2014లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకం అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా 1800 మంది బీమా మిత్రలను నియమించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వారిని తొలగించారు. దీంతో 'చంద్రబాబు రావాలి... సైకో పోవాలి' అని రాసిన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పునఃప్రారంభించి, తమను ఆదుకోవాలని జిల్లా బీమా మిత్రలు కోరారు. - బెళుగుప్ప

అప్పుల ఊబిలో రాష్ట్రం

బహిరంగ సభలో టీడీపీ నాయకులు

గుంతకల్లు/ఉరవకొండ, జనవరి 27: 'రా.. కదలిరా..' బహిరంగ సభలో పలువురు జిల్లా నాయకులు ప్రసంగించారు. వైసీపీ మునిగిపోయే నావ అని మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి అన్నారు. జగన్‌ను ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. రూ.12.5 లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్, రాష్ట్రాన్ని అధ్వాన స్థితిలోకి నెట్టేశారని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలిపిన నేత ఎన్టీఆర్ అని, తెలుగువారికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన గొప్ప నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఉరవకొండలో దౌర్జన్యాలు, దుర్మారాలు, కబ్జాలు పెచ్చుమీరిపోయాయని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అన్నారు. ఇక్కడ ప్రశాంత వాతావరణం నెలకొల్పాల్సిన అవసరం ఉందని అన్నారు. విశ్వ కుమారుడు స్థానిక ఎమ్మెల్యేని పరుషమైన పదజాలంతో మాట్లాడటం సరికాదని అన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదలి పారిపోతారని అన్నారు. చంద్రబాబునాయుడు విజన్ లీడర్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును మళ్లీ సీఎం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తాడేపల్లి పిల్లిని తరిమేద్దామని అన్నారు.

ఎవరిపైనో అలక..!

అనంతలో ఇంటింటికీ వైసీపీ ప్రారంభం

కొందరు నాయకుల గైర్హాజరు



ఇంటింటికీ వైసీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం క్రైం, జనవరి 27: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీలోని లుకలుకలు బహిర్గతమవుతున్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వైసీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని భవానీనగర్‌లో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు డుమ్మా కొట్టారు. ఇందులో నామినేటెడ్ పదవులు పొందిన వారు సైతం ఉండటం గమనార్హం. నాలుగు రోజుల కిందట ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి సైతం వైసీపీ నాయకులు హాజరుకాలేదు. వారు ఈ కార్యక్రమానికి రాకపోవడానికి ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డిపైన ఉన్న అలకా..?లేక వచ్చే ఎన్నికల్లో టికెట్‌పై అలకా...?అనేది అంతుబట్టడం లేదు. గత కొంతకాలంగా వచ్చే ఎన్నికల్లో అనంతపురం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కోసం కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో పార్టీ అధిష్టానం కొందరికి ఈ సారి లేదని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో సైతం తొలుత ఎమ్మెల్యే అనంతకు వ్యతిరేకంగా కొందరు నేతలు మసిలారు. కానీ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే అనంతకు టికెట్ కేటాయించడంతో కొందరిని కలుపుకుపోగా, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మరికొందరు కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కానీ కొందరు నేతలు అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి ఎమ్మెల్యేకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. మరికొందరు మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక సమయంలోనూ అసంతృప్తిగా ఉన్నారు. ఇంకొందరు తమకు నామినేటెడ్ పదవులు రాకపోవడంపైనా గుర్రుగా ఉన్నారు. మరి రానున్నరోజుల్లో ఇంటింటికీ వైసీపీ కార్యక్రమం ఎలా ఉండబోతుంది..?ఎమ్మెల్యే వారితో ఎలా వ్యవహరిస్తారు...? అనే విషయంపై పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ సాగుతోంది.

ఉప్పొంగిన ఉరవకొండ

రా.. కదలి రాతో ఉరకలెత్తిన ఉత్సాహం
పార్టీ శ్రేణులు, జనానికి చంద్రబాబు భరోసా
టీడీపీ-జనసేన కూటమిదే అధికారమని ధీమా


అనంతపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'రా కదలి రా' బహిరంగ సభకు జనం పోటెత్తారు. పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. అశేష జనవాహినితో ఉరవకొండ జనసంద్రంగా మారింది. అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన శనివారం ఈ సభను నిర్వహించారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరై ప్రసంగించారు. పార్టీ శ్రేణులు, కరువు జిల్లా ప్రజానీకానికి భరోసా ఇచ్చారు. సీఎం జగన్ సైకో పాలన సాగిస్తున్నారని నిప్పులు చెరిగారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవినీతిని తూర్పారబట్టారు. వైసీపీ పనైపోయిందని, టీడీపీ, జనసేన కూటమిదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఆ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లా అంటే తనకు అమితమైన అభిమానమని, తన గుండెకు దగ్గరగా ఉండేది ఈ జిల్లానే అని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేసి, జిల్లాలోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందించి అన్నదాతను ఆదుకుంటానని అన్నారు. వైసీపీ అరాచక పాలనలో ఇబ్బందలు పడిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. తన కార్యకర్తల జోలికొస్తే ఎవ్వరినీ వదిలిపెట్టనని, ఖబడ్దార్ వైసీపీ గుండాల్లారా అని హెచ్చరించారు.

తరలివచ్చిన నాయకులు

ఉరవకొండ సభకు పార్టీ రాయలసీమ జోన్ పరిశీలకుడు బీద రవిచంద్ర యాదవ్, మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి, పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, ఉన్నం హనుమంతరాయచౌదరి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాయలసీమ జోన్ మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉమామహేశ్వరనాయుడు, పరిటాల శ్రీరామ్, శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆ నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి శ్రీ, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మేయర్ స్వరూప, రాష్ట్ర నాయకులు వెంకటశివుడు యాదవ్, సవిత, గౌస్‌మొద్దీన్, రామ్మోహన్ చౌదరి, బుగ్గయ్య చౌదరి, జేఎల్ మురళి, శివబాల, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, గడ్డం సుబ్రహ్మణ్యం, విశాలాక్షి, దండు శ్రీనివాసులు, రాయల్ మురళి, అంజనప్ప, కుంచెపు వెంకటేష్, వెంకటప్ప, జనసేన నాయకులు టీసీ వరుణ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, పెండ్యాల శ్రీలత తదితరులు తరలివచ్చారు.


వేదికపై గుసగుసలు

జగన్‌కు దిమ్మతిరగాలి



ఉమ్మడి జిల్లాను తాను ఎక్కువగా అభిమానిస్తానని చంద్రబాబు అన్నారు. తన గుండెకు దగ్గరగా ఉండే జిల్లా అనంతపురం అని అన్నారు. ఒకప్పుడు వర్షం పడక పంట రాకపోతే మొట్టమొదటిసారి వేరుశనగ పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి, రైతాంగాన్ని ఆదుకున్నామని అన్నారు. కరువు ఏర్పడినప్పుడు పశువుల మేపుకునేందుకు రైతులకు క్యాంపులు పెట్టామని గుర్తు చేశారు. అప్పటి నుంచే జిల్లాకు నీరు తీసుకురావాలనే ఆకాంక్ష పెరిగిందని అన్నారు. ఆ క్రమంలోనే హంద్రీనీవాను తీసుకొచ్చామని అన్నారు. ప్రతి ఎకరానికీ నీరిచ్చి, పేదరికం లేకుండా చేసి, పొలంలో బంగారం పండించే వరకు రైతులకు తాను అండగా ఉంటామని చంద్రబాబు అన్నారు. అధికారంలోకి రాగానే చేసి చూపిస్తానని అన్నారు. 'ఈ సారి ఎన్నికల్లో మీరిచ్చే ఫలితాలు జగన్‌కు దిమ్మతిరగాలి' అని ప్రజలతో అన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలలో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ జెండా ఎగరాలి.. వైసీపీ జెండా భూస్థాపితం కావాలి అని అన్నారు.

అభివృద్ధి చేస్తా..

జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని చంద్రబాబు అన్నారు. జిల్లాకు జీవనాడైన డ్రిప్ ఇరిగేషన్‌ను మళ్లీ తీసుకొస్తానని అన్నారు. భైరవాన్ తిప్ప, పేరూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తానని అన్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌లోని పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తానని అన్నారు. గార్లదిన్నె, శింగనమలలో షాదీఖానాలు కట్టిస్తామని అన్నారు. రద్దు చేసిన సబ్ ప్లాన్లు మళ్లీ అమలు చేసి, వెనుకబడిన వర్గాలను ఆదుకుంటామని అన్నారు. ఆ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చి, వారి రుణాన్ని తీర్చుకుంటానని అన్నారు. ఆ వర్గాలన్నీ తెలుగుదేశాన్ని ఆశీర్వదించాలని కోరారు. సామాజిక న్యాయానికి మారుపేరు టీడీపీ అని అన్నారు. మాదిగలకు న్యాయం చేయబోయేది టీడీపీనే అని అన్నారు. మైనార్టీలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గండికోట, నిట్టూరు, బుక్కాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేస్తామని అన్నారు. చిత్రావతి నదిపై తాడిపత్రి - పులివెందుల బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. ఉరవకొండలో చేనేత కార్మికులకు చేయూత అందిస్తామని అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలకు రక్షణ ఏదీ..?

జగన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మీ ఆస్తులు మీవి కాకుండా పోతాయని చంద్రబాబు అన్నారు. ఎవరు ఎదురు మాట్లాడితే వారి ప్రాణాలు ఉండవని అన్నారు. ఈ అరాచక పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేదని, ఇందుకు బ్రహ్మసముద్రంలో జరిగిన సంఘటనే నిదర్శనమని అన్నారు. తన కోరిక తీర్చలేదని ఓ కిరాతకుడు నడి బజారులో ఆడబిడ్డను కొడితే పోలీసులు వెళ్లలేదంటే సిగ్గుగా లేదా అని ఆయన మండిపడ్డారు. 'మీ ఇంట్లో ఆడవాళ్లకు ఇలా జరిగితే మీరు సహిస్తారా?' అని పోలీసులను నిలదీశారు. 'ఆంబోతురాలా జాగ్రత్త.. వీలాంటి ఆంబోతులను నడిరోడ్డులో బట్టలు ఊడదీసి ఊరేగిస్తాం' అని హెచ్చరించారు. ఆడ బిడ్డలకు రక్షణగా టీడీపీ అండగా ఉంటుందని అన్నారు.

కార్యకర్తలకు అండ..

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలు టీడీపీతోనే ఉన్నారని చంద్రబాబు అన్నారు. జగన్ విధ్వంసాన్ని, తుగ్లక్ పాలనను ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించినా.. దాడులు చేసినా ఎదుర్కొన్నారని అన్నారు. పోలీసు వ్యవస్థను అనుబంధ వ్యవస్థగా మార్చుకొని, వైసీపీ వారు రాక్షస క్రీడ ఆడారని అన్నారు. 'ప్రాణాలు తీస్తున్నా ఒకే మాట.. జై చంద్రన్న, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలే కార్యకర్తలు ఉన్నారు. కష్టకాలంలో పనిచేసిన టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేసే బాధ్యత నాది. ఏ గ్రామంలో ఎవరెవరు మిమ్మల్ని ఇబ్బంది పెట్టారో.. చిత్రగుప్తుడిలాగా రాసుకుంటున్నా. వడ్డీ, చక్రవడ్డీ సహా తిరిగి చెల్లిస్తా' అని వైసీపీ నాయకులను హెచ్చరించారు. పోలీసులకు అండగా ఉండే పార్టీ టీడీపీ అని అన్నారు. 'మీ డ్యూటీ మీరు చేయండి. చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

జిల్లాకు అన్యాయం..

జగన్ జిల్లాకు తీరని అన్యాయం చేశారని చంద్రబాబు మండిపడ్డారు. గోదావరి నీటిని రాయలసీమకు తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. కొంత వరకు జయప్రదం చేశామని, టీడీపీ అధికారంలో ఉండి ఉంటే పూర్తిగా నెరవేరేదని అన్నారు. టీడీపీ హయాంలో నీళ్లు ఇవ్వడం ద్వారా రైతులు కోట్లు సంపాదించారని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 50 ఎకరాల్లో కౌలు రైతు రూ.2.30 కోట్లు సంపాదించారని అన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇచ్చామని గుర్తు చేశారు. 10 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించామని అన్నారు. తద్వారా ఉద్యాన పంటలను పండించి, రైతులు డబ్బులు బాగా సంపాదించారని అన్నారు. జిల్లాలో నీరుంటే .. గోదావరి జిల్లాలు కూడా పోటీ పడలేవని అన్నారు. అక్కడ వరి మాత్రమే పండించుకోవాలని, అనంతలో ప్రపంచంలోని అన్ని రకాల వాణిజ్య పంటలు పండించే పరిస్థితి వస్తుందని అన్నారు. గత 25 ఏళ్లతో పోలిస్తే భూమి విలువ పెరిగిందని అన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఈ రంగంలోకి వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఉరవకొండలో కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్‌ను మొదలుపెట్టామని, ఇది పూర్తై ఉంటే 50 వేల ఎకరాల్లో పంటలు పండించేవారని, తద్వారా సంపద పెరిగేదని అన్నారు. కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్‌ను ఆపేసి రూ.30 కోట్లు వృథా చేశారని, డ్రిప్ పరికరాలు, పైపులు తప్పుపట్టాయని అన్నారు. రైతులకు వైసీపీ తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి సీఎం పదవికి అర్హుడా అని ప్రశ్నించారు. 'ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇచ్చాడా..? డీఎస్సీ పెట్టాడా?' అని ప్రశ్నించారు. దిగిపోయేటప్పుడు నోటిఫికేషన్ ఇస్తాడంట.. ఇంకా ఎవరినిమోసం చేయాలని అనుకుంటున్నారో అని ఎద్దేవా చేశారు.



ఎవ్వరినీ వదిలిపెట్టం..

దొంగ ఓట్లు నమోదు చేసిన అధికారులను, దొంగ ఓట్లు వేసే వైసీపీ నాయకులను ఎవర్నీ వదిలిపెట్టబోమని చంద్రబాబు అన్నారు. ఉరవకొండలో దొంగ ఓట్లపై పయ్యావుల కేశవ్ పోరాటంతో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

అవినీతిని ఎండగట్టిన బాబు

జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని చంద్రబాబు తూర్పారబట్టారు. అక్రమాల్లో విశ్వరూపం చూపిస్తాడని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అవినీతిని ఎండగట్టారు. ఎక్కడ లే అవుట్ వేసినా ఆయనకు కప్పం కట్టాల్సిందేనని అన్నారు. చివరకు గాలిమరల సెక్యూరిటీ సిబ్బంది జీతాల్లోనూ వాటా ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పుడు ఎన్‌ఓసీలు సృష్టించి, ఆడబిడ్డల భూములను విశ్వేశ్వరరెడ్డి కుమారుడు కొట్టేశాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని ఇన్‌చార్జిగా జగన్‌రెడ్డి నియమించారని మండిపడ్డారు. ఈ నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగిదంటే అది పయ్యావుల కేశవ్ వల్లేనని అన్నారు. మంత్రి ఉష శ్రీచరణ్ కరప్షన్ క్వీన్ అని విమర్శించారు. రూ.30 కోట్ల విలువైన సుజలాన్ విండ్ పార్కు భూములను డ్రైవర్ పేరుతో ఆమె కాజేశారని అన్నారు. పెన్నా నదిలో ఇసుకను అక్రమంగా తరలించారని, అక్రమ లే అవుట్లు వేసి ఇష్టానుసారంగా అమ్ముకున్నారని అన్నారు. పేద వారికిచ్చే ఇంటి జాగాలో వంద ఎకరాలను రూ.6 లక్షలకు కొని రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వానికి అమ్ముకున్నారని ఆరోపించారు. అందుకే కళ్యాణదుర్గం నుంచి పెనుకొండకు ఆమెను జగన్ మార్చారని అన్నారు. ఈ ఊర్లో ఉన్న చెత్త ఏ ఊర్లోనూ బంగారం అవ్వదని, ఆ చెత్తను డంప్‌యార్డుకు పంపించాలని ప్రజలను కోరారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో మరలా ఫ్యాక్షనిజాన్ని తీసుకొచ్చారని, ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఓ దొడ్డరెడ్డి.. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎగిరెగిరి పడుతున్నారని, వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. శింగనమల నియోజకవర్గాన్ని ముక్కలు ముక్కలు చేసిన ఎమ్మెల్యేకు సీటు లేకుండా పోయిందని అన్నారు. మాట్లాడితే కేసులు పెడతారేమోనని ఆమె మౌనంగా ఉండిపోయారని అన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జగన్‌రెడ్డికి కాపు కాశారని, టికెట్ లేదు పొమ్మంటే తాడేపల్లి ప్యాలెస్‌కు సెల్యూట్ కొట్టి బైబై చెప్పారని అన్నారు. గుంతకల్లులో ఇసుక స్టాక్ పాయింట్ పెట్టి, ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అక్కడ ఎవరు గాలిపీల్చినా కప్పం కట్టాల్సిందేనంట అని మండిపడ్డారు. అనంతపురం ఎమ్మెల్యే రిటైర్‌మెంట్‌కు వచ్చేసి, చిల్లరకొట్టులు కొట్టుకుంటున్నారని అన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేల చెత్త తమకు వద్దని ప్రజలు ఛీదరించుకుంటున్నారని అన్నారు.



గెలుపు గుర్రాలకే టికెట్

అభ్యర్థి ఎవరైనా సమష్టిగా పనిచేయాలి.. ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో టీడీపీ-జనసేన కూటమి జెండా ఎగరాలి
పార్టీ ముఖ్యనేతలకు చంద్రబాబు దిశానిర్దేశం


ముఖ్యనేతలతో సమావేశమైన చంద్రబాబు

అనంతపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి జెండా ఎగరాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆ పార్టీ ముఖ్యనేతలకు సూచించారు. ఆ మేరకు శనివారం రాత్రి ఉరవకొండలోని విడిది కేంద్రంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులతో చంద్రబాబు అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఖరారు చేస్తామన్నారు. ముఖ్యంగా యువతతోపాటు బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అభ్యర్థి ఎవరైనా ఆ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగానే కష్టపడి పనిచేసిన వారికి తగిన గౌరవం కల్పిస్తామన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడటంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సైకో పాలనను అంతమొందించేందుకు, ప్రజల్లో మరింతగా చైతన్యం నింపే బాధ్యతను నాయకులుగా మీ భుజాలపై ఎత్తుకోవాలని చంద్రబాబు ముఖ్యనాయకులకు సూచించారు.

జనమే జనం..!

ఉరవకొండ/విడపనకల్లు, జనవరి 27: 'రా.. కదిలి రా' సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు వేల సంఖ్యలో తరలి వచ్చారు. అంచనాలు మించి జనం రావటంతో పోలీసు యంత్రాంగం అదుపు చేయలేకపోయింది. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు హెలిప్యాడ్ నుంచి వేదికపైకి వచ్చేందుకు పోలీసులు వెనుక వైపు నుంచి దారి ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.45 గంటలకు హెలిప్యాడ్‌లో దిగిన చంద్రబాబును చూసేందుకు జనం ఎగబడ్డారు. పోలీసులు అనుమతించకపోవటంతో చంద్రబాబు వచ్చే దారిలో ఏర్పాటు చేసిన వచి బారికేడ్లను తోసుకుని జనం స్టేజ్ వద్దకు చేరుకున్నారు. ఈ నెల 23న సీఎం జగన్ పర్యటన సందర్భంగా.. సభా వేదికను పొడవుగా ఏర్పాటు చేసి జనాన్ని అధికంగా చూపించే ప్రయత్నం చేశారు. వివిధ ప్రాంతాల మహిళలను బెదిరించి బస్సులలో బలవంతంగా సభకు తరలించారు. కానీ టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా వేల సంఖ్యలో తరలివచ్చి, సభా ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చేశారు. టీడీపీ అభిమానాన్ని చాటుకుంటూ, చంద్రబాబును చూసేందుకు ఫ్లడ్ లైట్ల కోసం ఏర్పాటు స్తంభాలపైకి ఎక్కారు.

ఘన స్వాగతం

ఉరవకొండకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ, పలువురు నాయకులు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. హెలిప్యాడ్‌లో దిగిన తరువాత చంద్రబాబు బస్సులో అర గంట సేద తీరారు. ఆ సమయంలో వేదికపై ఉన్న పార్టీ నాయకులు ప్రసంగాలను పూర్తి చేశారు. అనంతరం వేదికపైకి వచ్చిన చంద్రబాబు.. గంటకుపైగా ప్రసంగించారు. చీకటి పడుతున్నా జనం కదలకుండా, ఆసక్తిగా ఆయన ప్రసంగాన్ని విన్నారు. ఈలలు, కేకలు వేస్తూ మద్దతు తెలిపారు. బహిరంగ సభ పూర్తి అయిన తరువాత జాతీయ రహదారిపై వాహనాలు అరగంటకు పైగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు లేక పోవటంతో టీడీపీ కార్యకర్తలే ట్రాఫిక్ నియంత్రణ విధులను నిర్వర్తించారు.

గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌ను తనిఖీ చేసిన డీఆర్‌ఎం

గుత్తి ,జనవరి 27: గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని గుత్తి డీజిల్ షెడ్‌ను శనివారం గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్ సింగ్ తనిఖీ చేశారు. ఆర్వోహెచ్ షెడ్‌ను పరిశీలించారు. రైల్వే హెల్త్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ముందుగా రన్నింగ్ రూంలో లోకో పైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఇది వరకు క్రీడల్లో రాణించిన వారికి బహుమతులను అందజేశారు. రైల్వే హెల్త్ యూనిట్‌లో అంబులెన్స్, ల్యాబ్ సౌకర్యం లేదని గైనాకాలజిస్టు, చిన్నపిల్లల డాక్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు ఆయనకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ చౌహాన్, సీనియర్ డీఈ వీరయ్య, డీఎంఈ రమేష్, డాక్టర్ విజయలక్ష్మి, కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు హౌస్ వైరింగ్‌లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హౌస్ వైరింగ్‌లో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తామని టాటా స్ట్రైవ్ సంస్థ కోఆర్డినేటర్ పద్మావతి తెలిపారు. అసిస్టెంట్ ఎలెక్ట్రీషియన్ హౌస్ వైరింగ్ కోర్సులో నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు. మరమ్మతులపై శిక్షణతో పాటు వ్యక్తిత్వవికాసం, ఇంగ్లీష్, కస్టమర్లతో ఎలా మెలగాలి అనే అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 3 నెలల పాటు ఇచ్చే శిక్షణకు 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉండాలని తెలిపారు. మూడు నెలల పాటు పులివెందులలోని టాటా స్ట్రైవ్ సంస్థలో శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి సర్టిఫికెట్ అందజేస్తామని, అనంతరం నూరు శాతం ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 6301162108 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రూప్1, 2 శిక్షణకు మరో అవకాశం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 27: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-1,2 ప్రవేశ పరీక్షకు శిక్షణ పొందేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకు విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు గత సంవత్సరం డిసెంబరులో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు ఖాళీలు ఉన్న నేపథ్యంలో... ఆ ఖాళీలను భర్తీ చేయడంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అభ్యర్థులకు మరో అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా గ్రూప్1, 2కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

తనకల్లు, జనవరి 27: మండలంలోని నడింకుంటపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చేలకూర విషయంపై గొడవపడి అన్న సంజీవులును తమ్ముడు వెంకటేశ్ హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడు వెంకటేశ్‌ను శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత కొక్కంటిక్రాస్‌లో కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనకల్లు పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా హత్యకు ఉపయోగించిన మందపాటి చెక్కను నడింకుంటపల్లి సమీపంలో మోరీ కింద దాచినట్లు తెలిపాడు. పోలీసులు అక్కడికెళ్లి చెక్కను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎంపిక


పురుషోత్తంరెడ్డి


తిమ్మారెడ్డి

అనంతపురం విద్య, జనవరి 27: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీఆర్టీయూ నూతన కార్యవర్గాలను ఎంపిక చేసినట్లు ఆ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా సమన్వయకర్త విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు జిల్లాలకు కొత్త కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశామన్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిమ్మారెడ్డిని, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేశామన్నారు.

లేపాక్షి శిల్పకళ అమోఘం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మదరావు

హిందూపురం, జనవరి 27: లేపాక్షి శిల్పకళ అమోఘమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మదరావు అన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని చిత్రకళ, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని ఆశ్చర్యంగా వీక్షించారు. ఆలయ చరిత్రను, విశిష్టతను అర్చకులు వారికి వివరించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ అలనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా శిల్పకళా చిత్రాలు ఉన్నాయన్నారు. ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట హిందూపురం అదనపు జిల్లా న్యాయాధికారి శైలజ, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ రమానంద స్వామి, ఆలయ ఈఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.


ఆలయ శిల్ప సంపదను వీక్షిస్తున్న న్యాయమూర్తి దంపతులు


పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

పుట్టపర్తిలో..

పుట్టపర్తి: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మదరావును జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం కలిశారు. పుట్టపర్తికి వచ్చిన ఆయన్ను కలెక్టర్ ప్రశాంతి నిలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జడ్జి లేపాక్షి పర్యటనకు వెళ్లారు.

వేరుశనగ విత్తనాభివృద్ధి జరగాలి

కదిరి, జనవరి 27: వేరుశనగ విత్తనాభివృద్ధి జరగాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బరావు, వ్యవసాయ ప్రధానశాస్త్రవేత్త సంపత్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధనాస్థానంలో జిల్లాస్థాయి వ్యవసాయాధికారుల శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా గతంలో 32 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యేవని, ప్రస్తుతం 18వేల హెక్టార్లలో మాత్రమే సాగవుతున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం వల్ల భూగర్భజలాలు తగ్గిపోయాయన్నారు. తద్వారా రబీ పంటకు భూగర్భజలాల కొరత ఏర్పడి, పంటల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని, దీని నివారణకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వేరుశనగలో కాండం కుళ్లు తెగులు ఆశించిందని, రైతులు శాస్త్రవేత్తల దృష్టికి తెచ్చారు. ప్రధాన శాస్త్రవేత్త సంపత్ మాట్లాడుతూ వేరుశనగ దిగుబడికి నూతన రకాలను ఇప్పటినుంచి విత్తన పథం ద్వారా విత్తనాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. శిక్షణలో డాక్టర్లు వెంకటరమణ, చిన్నరాయుడు, రామసుబ్బయ్య, ఏఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్తలు

నేడు పీసీసీ చీఫ్ షర్మిల రాక

● పలువురు కాంగ్రెస్‌లో చేరే అవకాశం!

● ఏర్పాట్లను పరిశీలించిన మాజీ చీఫ్ శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 27: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం జిల్లాకు రానున్నారు. ఏపీ పీసీసీ చీఫ్ అయిన తరువాత తొలి సారి జిల్లాకు రానుండటంతో ఆమె పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. జిల్లాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తునే ఉన్నారు. వీరిలో చాలా మంది వైఎస్ జగన్ పార్టీ పెట్టిన తరువాత అందులో చేరారు. మిగిలిన వారు ఏ పార్టీలోకి వెళ్లకుండా సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొందరు సిట్టింగ్‌లకు వైసీపీలో టికెట్ దక్కలేదు. అలాంటి వారిలో వైసీపీ పట్ల వ్యతిరేకత మొదలైంది. ఈక్రమంలో షర్మిలా పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. వారు కాంగ్రెస్ వైపు వెళ్లే అవకాశం ఉంది. దివంగత రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్తేజం నెలకొంది. అంతేగాక షర్మిల తన ప్రసంగాల్లో అధికార పార్టీ అక్రమాలను ఎత్తి చూపుతూ ఏకి పారేస్తోంది. దీంతో వైసీపీలో అసంతుష్టులుగా ఉన్న పలువురు వైఎస్ఆర్ అభిమానులు తిరిగి సొంతగూటికి చేరే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల నుంచి షర్మిల సమక్షంలో కాంగ్రెస్ కండువ కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

సాయంత్రం 5 గంటలకు ఎల్‌కేపీలో కార్యకర్తలతో సమావేశం

పీసీసీ చీఫ్ షర్మిల ఆదివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొనే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తర్వాత స్థానిక లలితకళాపరిషత్‌లో కార్యకర్తలతో సమావేశం అవుతారని తెలిపారు. ఈసమావేశానికి సంబంధించి ఏర్పాట్లలో పలువురు కాంగ్రెస్ నాయకులు నిమగ్నం అయ్యారు. శనివారం సాయంత్రం మాజీ పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ సైతం జిల్లా అధ్యక్షుడితో కలిసి ఎల్‌కేపీలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

నాట్‌లో పురం విద్యార్థికి ప్రథమ ర్యాంకు

కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం నుంచి పిలుపు


విద్యార్థులు ముస్తాఫా, రిధ ఫాతిమతో పాఠశాల ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, జనవరి 27: జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో (ఎన్ఏఏటీ) శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన పాంచజన్య బ్రిలియంట్ పాఠశాల విద్యార్థి ముస్తఫా ప్రథమ ర్యాంకు సాధించారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు ఈ విషయాన్ని శనివారం విలేకరులకు తెలిపారు. నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్ ఇండియా వారు గత నెలలో ఈ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ నెల 25న ఫలితాలు వెలువడ్డాయని, ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తాఫాకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని రిధ ఫాతిమా ఆ తరగతి విభాగంలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నాలుగో తరగతి విద్యార్థుల్లో జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన ముస్తఫాకు ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి ఆహ్వానం లభించిందని తెలిపారు. విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మక ఆలోచన, తార్కిక తార్కికం, సమస్యల పరిష్కారం, బహుల మేధస్సు అనే అంశాలపై పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి నందకుమార్, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత, నందిత, హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్‌ఎంలు శశికళ, సతీష్‌కుమార్, అబ్దుల్ రజాక్ తదితరులు ఉన్నారు.



చంద్రాయుడుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న పరిటాల సునీత

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా చంద్రాయుడు

చెన్నేకొత్తపల్లి, జనవరి 27: రాప్తాడు నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా మండలంలోని బసంపల్లికి చెందిన జీ.చంద్రాయుడును నియమించారు. ఈ మేరకు అతనికి అనంతపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత నియామక ఉత్తర్వులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ జోన్-5 పాండు తలపనేని, హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శివరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు రామగిరిలో జయహో బీసీ సదస్సు

రామగిరి, జనవరి 27: రామగిరిలో జయహో బీసీ సదస్సును ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పరిటాల సునీత హాజరవుతారని టీడీపీ మండల నాయకులు తెలిపారు. శనివారం మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీసీలు, బీసీ అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, నాయకులు పరందామ యాదవ్, శివకుమార్, తెలుగు యువత రామాంజి నేయులు, మల్లికార్జున, ద్రోణాద్రి, రామ్మూర్తి, చిత్తరంజన్, నాగరాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సభ్యులు

అనంతపురంరూరల్, జనవరి 27: ఎలక్ట్రీషియన్లను ఆదుకోవడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం నగర ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్ డే నిర్వహించారు. నగరంలో క్రిష్ణకళా మందిరం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, శ్రీ కంఠంసర్కిల్ మీదుగా టవర్‌క్లాక్, బళ్లారి బైపాస్ సర్కిల్, మూడో రోడ్డులోని వరసిద్ధి వినాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫంక్షన్ హాల్ నందు సమావేశం నిర్వహించారు. ఇందులో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిప్రకాష్, నగర కమిటీ లీగల్ అడ్వైజర్ నాగన్న, నగర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడారు. పనిముట్లకు రూ.రెండు లక్షల వరకు బ్యాంకుల ద్వారా సబ్సిడీతో రుణసదుపాయం కల్పించాలన్నారు. ఏదైన ప్రమాదంలో గాయపడిన, మృతిచెందిన వారికి లేబర్ ఇన్సురెన్స్ చేసుకున్న వారికి క్లెయిమ్స్ వెంటనే ఇవ్వాలన్నారు. ఇంటి పట్టాలతో పాటు అసోషియేషన్ బిల్డింగ్ ఏర్పాటుకు 10 సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు బాబు, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి భాస్కర్ యాదవ్, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు షాషావలి, తిప్పేస్వామి, గురుమూర్తి, చంద్రమోహన్, మోహన్‌కుమార్, శ్రీనివాసరావు, రాప్తాడు అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు డిపిబాబు, కార్యదర్శి సురేంద్ర, శింగనమల అధ్యక్షుడు మల్లికార్జున, సభ్యులు మనోహర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టని వైసీపీ



థామస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

అనంతపురం సెంట్రల్ : తన ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కార్మికుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని ఎలక్ట్రికల్, ప్లంబర్ కార్మికులు మండిపడ్డారు. థామస్ అల్వా ఎడిషన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్ డేను స్థానిక ఆ సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు షేక్షావలి థామస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఇసుక, మెటీరియల్ ధరలను 200 శాతం పెంచి కార్మికులకు కూలి పనులు లేకుండా చేసిందన్నారు. ప్రసూతి, పెళ్లికానుక ఆర్థికసాయాన్ని అటకెక్కించిందని, కరోనా భృతిని దిగిమింగి కార్మికుల కడుపు కొట్టి పస్తులు పెట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని అభివృద్ధి పనులను అర్హతలేని కాంట్రాక్టర్లకు అప్పగించి.. రూ.కోట్లు తగల బెడుతూ కార్మికులకు కూలిపనులు లేకుండా చేస్తోందన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఖాజావలి, శశికుమార్, వెంకటనారాయణ, రంగా పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె

అనంతపురం క్రైం, జనవరి 27: మున్సిపల్ కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారానికి తొమ్మిదో రోజుకు చేరింది. శనివారం జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుడు నడి రోడ్డో కూర్చొని భోజనం చేస్తూ నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ... ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా చర్చలు జరపాలన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి రామిరెడ్డి, సీఐటీయూ కార్యదర్శి వెంకట్ నారాయణ, గురురాజు, ముర్తుజా, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నల్లప్ప, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, మల్లికార్జున రాయుడు, ఓబుళపతి, మురళీ, లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

రాప్తాడు, జనవరి 27: విజయవాడలో సోమవారం నిర్వహించే వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సును జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రాప్తాడులో ఆ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శులు ధనుంజయ, వంశీ, నాయకులు దుర్గాప్రసాద్, రవి, మురళి, నారాయణస్వామి పాల్గొన్నారు.

నేడు ఏపీటీఎఫ్ విద్యా సదస్సు

అనంతపురం విద్య, జనవరి 27: స్థానిక ఆర్ట్స్ కాలేజీలో విద్యాసదస్సును ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం, ప్రస్తుతం విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులపై, స్కూళ్ల మనుగడ తదితర అంశాలపై ఇందులో చర్చిస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు చదువు అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లను బలోపేతం చేయాల్సిన ప్రథమ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు హనుమప్ప, డేనియల్, నాగరాజు, గాయత్రీ, బొమ్మయ్య, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

అనంతపురం టౌన్, జనవరి 27: స్థానిక ఆస్పత్రి మార్చురీలో ఉన్న ఓ అనాథ వ్యక్తి మృతదేహానికి సాయి సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు రోజుల కితం బళ్లారి రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. పోలీసులు ఆ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆయనకు సంబంధించినవారు ఎవరూ రాలేదు. దీంతో పోలీసులు అతన్ని అనాథగా గుర్తించి శనివారం ఆ మృతదేహాన్ని సాయిసంస్థ అధ్యక్షుడు విజయసాయికి అప్పగించారు. ఆ సంస్థ సభ్యులు ఆ వ్యక్తి మృతదేహానికి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు

- అనుమతులు లేకున్నా అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

రాప్తాడు, జనవరి 27: అనంతపురం నగరానికి సమీపంలో ఉండటం.. పంచాయతీ పరిధిలో బెంగళూరు వెళ్లే జాతీయ రహదారి ఉండటంతో రాప్తాడు గ్రామ పంచాయతీ పరిధిలో భూములకు మంచి డిమాండ్ ఉంది. దీంతో కుప్పలు తెప్పలుగా అక్రమ లేఔట్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. సాధారణంగా రియల్టర్లు రైతుల నుంచి భూమి కొనుగోలు చేసిన తర్వాత... ల్యాండ్ కన్వర్షన్ చేసి.. పంచాయతీ, అహుడా అనుమతి పొందాలి. ప్లాట్లు వేసిన ప్రదేశంలో 10 శాతం భూమిని గ్రామ పంచాయతీకి కేటాయించాలి. వెంచర్‌లో విద్యుత్ స్తంభాలు, మురుగు కాలువలు, రోడ్లు వేసిన తరువాత ప్లాట్లు విక్రయించాలి. అయితే రియల్టర్లు అవేమీ పట్టించుకోవడం లేదు. పంచాయతీ, అహుడా అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ప్లాట్లు వేసి రూ. లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొంతమంది రియల్టర్లు ల్యాండ్ కన్వర్షన్ మాత్రమే చేసి.. అహుడా అనుమతి లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. కొందరు అహుడా అనుమతి ఉందని మాయ మాటలు చెప్పి ప్లాట్లు అమ్మేస్తున్నారు. ఇలా అక్రమంగా ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నా... అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారులకూ ఈ అక్రమాల్లో వాటాలు ఉండటంతోనే వారు పట్టించుకోవడం లేదనే విమర్శలూ ఉన్నాయి.



ఈ వెంచర్ రాప్తాడు రైల్వే గేటు సమీపంలోది. సర్వే నెంబర్ 179-1బిలో 1.82 ఎకరాల్లో వెంచర్ వేశారు. ల్యాండ్ కన్వర్షన్ మాత్రమే చేయించారు. అహుడా అనుమతి లేదు. గ్రామ పంచాయతీకి 10 శాతం భూమి కూడా కేటాయించలేదు. అయినప్పటికీ ఆ వెంచర్‌లో ప్లాట్లు విక్రయించారు.



ఈ వెంచర్ గంగలకుంట రోడ్డులో ముత్యాలమ్మ దేవాలయం పక్కన ఉంది. సర్వే నెంబర్ 492-3లో 3.87 ఎకరాల స్థలంలో మొత్తం 84 ప్లాట్లు వేశారు. అహుడా అనుమతి లేకున్నా ఇప్పటికే చాలా ప్లాట్లు విక్రయించారు.



ఈ వెంచర్ ఆటో నగర్ పక్కన ఉంది. సర్వే నెంబర్ 477లో 1.74 ఎకరాల్లో 33 ప్లాట్లు వేశారు. అహుడా అనుమతి తీసుకోలేదు. పంచాయతీకి 10 శాతం భూమి కేటాయించలేదు. ఇప్పటికే చాలా ప్లాట్లు అమ్మేశారు.

మున్సిపల్ టీచర్ల బకాయి పీఎఫ్ చెల్లించండి

అనంతపురం విద్య, జనవరి 27: అనంతపురం నగర పాలక సంస్థ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు బకాయి ఉన్న పీఎఫ్ నగదును వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ మేరకు శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మేఘ స్వరూప్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు రామానాయక్ మాట్లాడుతూ... 2009 ఏడాది ముందు నగర పాలక సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్‌ను జీతం నుంచి మినహాయించి పద్దుల (లెడ్జర్) రూపేణా వ్యక్తిగత నెంబర్లతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించేవారన్నారు. 2009 తర్వాత ప్రభుత్వం 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లించడంతో, మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించకపోవడంతో పీఎఫ్ రికవరీ ఆపేశారన్నారు. 2009 వరకూ రికవరీ చేసిన మొత్తం సుమారు రూ. 20 లక్షలకు పైగా మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్ ఖాతాలోనే ఉండిపోయిందన్నారు. గతంలో ఉద్యోగ విరమణ సమయంలో మాత్రమే టీచర్లకు చెల్లిస్తున్నారని, అలాకాకుండా టీచర్లకు వారి వ్యక్తిగత ఖాతాకు పీఎఫ్ నగదు బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అశోక్ నాయక్, హుస్సేన్ ఖాన్, టీచర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రేపటి నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

అనంతపురంరూరల్, జనవరి 27: పీవీకేకే ఐటీ డిప్లొమా కళాశాలలో స్వాధ్యాయ-2024 పేరుతో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వైభవ్ శనివారం తెలిపారు. జేసీ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను మెరుగు పరచడానికి ఆరేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

సీపీఐ కమిటీ ఏర్పాటు

శింగనమల, జనవరి 27: మండలంలోని కొరివిపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో గ్రామ కమిటీని ఎంపిక చేసినట్లు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. గ్రామకార్యదర్శిగా కుళ్లాయప్ప సహాయ కార్యదరిగా పెద్దక్క కమిటీ సభ్యులుగా నారాయణస్వామి, ఓబుళపతి, నారాయణమ్మ, తిరపాలమ్మ వెంకటనారాయణను నియమించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు కరణ, నేసేమదు పాల్గొన్నారు.

కొనసాగిన క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27: స్థానిక అనంత క్రీడాగ్రామంలో సీనియర్ ఏపీఎల్ క్రికెట్ పోటీలు శనివారమూ కొనసాగాయి. ఈ పోటీల్లో కదిరి, గుంతకల్లు, పెనుకొండ, దినేష్‌గ్రానైట్స్ జట్లు విజయం సాధించినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.

కొనసాగిన భానూబీ నిరసన

అనంతపురం టౌన్, జనవరి 27: ఎమ్మెల్యే అనుచరుడు తమ భూమిని అక్రమించుకున్నాడని శింగనమల మండలం ఆకులేడుకు చెందిన వృద్ధురాలు భానూబీ, కొడుకు దస్తగిరితో కలిసి కలెక్టరేట్ ఎదుట చేపటిన నిరసన నాలుగో రోజైన శనివారమూ కొనసాగింది. వారు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ కలెక్టరేట్ ఎదుట రోజూ నిరసన చేపడుతున్నామన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆపబోమని తేల్చిచెప్పారు.

ముగిసిన భాగవత సప్తాహ శ్రవణ యజ్ఞం

నార్పల, జనవరి 27: నార్పలలో తిక్కయ్యస్వామి ఆశ్రమంలో కోదండ రామాలయంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహ శ్రవణ యజ్ఞం శనివారంతో ముగిసింది. ఆశ్రమ నిర్వాహకులు అమ్మవారిని మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భాగవత సప్తహ సంఘం అధ్యక్షుడు తీగల నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు నారాయణప్ప, ఆశ్రమ నిర్వాహకుడు గవ్వల సుబ్బయ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27: జిల్లాకు చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు వైష్ణవి, జ్యోతి, సోను ఆదివారం నుంచి ముంబయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్-19 జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నారు. డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, శాప్‌కోచ్ వంశీ వారిని అభినందించారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు

అనంతపురం సెంట్రల్, జనవరి 27: ఆర్ట్స్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం వేరువేరుగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ కాలనీలో కేఎస్ఎన్ కళాశాల, కురుగుంటలో ఆర్ట్స్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, విష్ణుప్రియ మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించారు

కందిపంట దగ్ధం

పెద్దపప్పూరు, జనవరి 27: మండలంలోని చీమలవాగుపల్లి గ్రామంలోని రైతు రంగన్నకు చెందిన కందిపంటను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. 4.5ఎకరాల్లో కందిపంటను రంగన్న సాగుచేశాడు. పంట చేతికి రావడంతో ఈనెల 23న కోత కోసి కుప్పగా ఉంచాడు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.1.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎస్ఐ శరత్‌చంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారోత్సవం

అనంతపురం కల్చరల్, జనవరి 27: జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ సభను ఆదివారం స్థానిక గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య ప్రముఖులు హాజరవుతున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ సభను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి దాదాపు 300 బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. పాతూరు గాంధీ సర్కిల్ వద్ద మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను స్వాగతించి, అనంతరం కేటీఆర్ ఫంక్షన్ హాల్ వరకు ఈ బైక్‌ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు.

లెనిన్ రచనలు.. స్ఫూర్తిదాయకం : సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 27: లెనిన్ రచనలతో ప్రజలు దోపిడీ, దౌర్జన్యాల నుంచి విముక్తి పొందాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సూచించారు. సీపీఎం ప్రచురించిన 'లెనిన్ జీవితం కృషి' పుస్తకాన్ని శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయని, సంపద కొద్దిమంది వద్దే కేంద్రీకరించబడుతోందని, దీంతో కోట్ల మంది దారిద్ర్యం, పేదరికంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారం పాలకుల మార్పు కాదు అని, విధానాల్లో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. దేశంలో మతతత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు కలగలిసి బీజేపీ రూపంలో పరిపాలిస్తున్నాయని విమర్శించారు. కోట్లమంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకుల్లో చలనం లేదన్నారు. జీవిత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు విగ్రహాలు, పూజలను పాలకులు ఉపయోగించుకుంటున్నారన్నారు. తీవ్రమైన సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రభుత్వాలు వైఫల్యం చెందుతాయని లెనిన్ ఆనాడే విశ్లేషించారన్నారు. సమ్మెలు, పోరాటాలు ఉధృతమవుతాయని, వీటిని సక్రమమైన పద్ధతుల్లో నడపడం ద్వారానే నూతన సమాజ నిర్మాణం సాధ్యమని లెనిన్ బోధించారన్నారు. ఆ బోధనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే 'లెనిన్ జీవితం కృషి' పుస్తకాన్ని రూపొందించారని, దీనిని ప్రతిఒక్కరూ అధ్యయనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రామిరెడ్డి, నాగమణి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకట నారాయణ, ముస్కిన్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ జడ్పీటీసీ, తదితరులు

'యల్లనూరు'లో వైసీపీకి షాక్

వైసీపీ మాజీ జడ్పీటీసీ టీడీపీలో చేరిక

బుక్కరాయసముద్రం, జనవరి 27: శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ కొత్తమిద్దె రమణ, యల్లనూరు మాజీ సర్పంచ్ ఓబులేసు, ఉప సర్పంచ్ సావిత్రితో పాటు వైసీపీకి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరవర్గం శనివారం ఉరవకొండలో జరిగిన సభలో టీడీపీలో చేరారు. చంద్రబాబునాయుడు వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంజే నాగరాజు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, జిల్లా అధికార ప్రతినిధులు పర్వతనేని శ్రీధర్‌బాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, డేగల క్రిష్ణమూర్తి, వాసాపురం బాబు, రామాంజి, కుళ్లాయప్ప నాయుడు, మాసూల్ చంద్ర, సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 27: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఏకాగ్రత, క్రమశిక్షణ చాలా అవసరమని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు సూచించారు. శనివారం జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. విద్యార్థుల జ్ఞాన సంపదకు అధ్యాపకులు, పుస్తకాలు, స్నేహితులు, సమాజం నాలుగు మూలస్తంభాలని అన్నారు. కళాశాలలోని ల్యాబ్‌లు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రయోగాత్మకంగా ఆలోచించాలన్నారు. ఫార్మసీ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని, వాటిని కైవసం చేసుకునే దిశగా అభ్యసించాలని అన్నారు. డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యం లేకుండా ఒకరికొకరు సహాయ సహకారాలందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీనాథ్, ఏఆర్ శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ విజేత చియ్యేడు



విజేత చియ్యేడు జట్టు

అనంతపురంరూరల్, జనవరి 27: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో చియ్యేడు కబడ్డీ జట్టు నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలిచింది. శనివారం ఆర్డీటీ మైదానంలో ఆత్మకూరు, చియ్యేడు జట్లు పోటీ పడ్డాయి. ఇందులో ఆత్మకూరు 29 పాయింట్లు, చియ్యేడు 46 పాయింట్లు సాధించింది. దీంతో ప్రత్యర్థి జట్టుపై 17 పాయింట్లతో చియ్యేడు జట్టు విజయం సాధించి.. జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆ జట్టు సభ్యులను మండల ఎంపీడీఓ పుల్లయ్య, తదితరులు అభినందించారు.

క్రికెట్‌లో గార్లదిన్నె విజేత

శింగనమల: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో గార్లదిన్నె జట్టు విజేతగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. శనివారం శింగనమలలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గార్లదిన్నె, బుక్కరాయసముద్రం జట్లు తలపడ్డాయి. రెండో స్థానంలో బుక్కరాయసముద్రం, మూడో స్థానంలో యల్లనూరు జట్లు నిలిచాయి. గార్లదిన్నె జట్టుకు రూ35 వేలు, బుక్కరాయసముద్రం జట్టుకు రూ.25వేలు, యల్లనూరు జట్టుకు రూ 10వేలను ఎంపీడీఓ నిర్మలాకుమారి అందజేశారు.

కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి

అనంతపురం టౌన్ జనవరి 27: జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కుష్టు విభాగాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుష్టువ్యాధిపై చాలా మంది ప్రజలకు అవగాహన లేదని, తొలుత దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారిని గుర్తించి సకాలంలో ప్రాథమిక దశలోనే చికిత్సలు అందిస్తే నయ మవుతుందని, ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు గంగాధరరెడ్డి, శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, సూర్యప్రకాష్‌రెడ్డి, రాయుడు పాల్గొన్నారు

వేలంతో రూ. 51 వేలు ఆదాయం

అనంతపురం కల్చరల్, జనవరి 27: స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద టెంకాయలు, పూజా సామగ్రిని విక్రయించే హక్కు వేలం వేయడం ద్వారా ఆలయానికి రూ. 51 వేలు ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం నిర్వహించిన ఈ వేలంలో ఆరుగురు పాల్గొన్నారని, నగరానికి చెందిన వెంకటరమణ రూ. 51 వేలు హెచ్చుపాటతో ఈ వేలం దక్కించుకున్నారని తెలిపారు. గతేడాది నిర్వహించిన వేలం ద్వారా ఆలయానికి రూ.26,500 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.51వేలు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు నీలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.

మాదిగల మహా సమ్మేళనం పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, జనవరి 27: మాదిగల మహా సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను మండలంలోని కురుగుంట ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ శనివారం విడుదల చేశారు. బుధవారం అశోక్‌నగర్‌లోని డా బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, మాదిగల ఐక్యత చాటేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మలరాయుడు, శకంర్, చిరంజీవి, రాము, దీక్షిత్, కిశోర్ పాల్గొన్నారు.

2,60,859 మంది ఓటర్లతో తుది జాబితా

రాయదుర్గం, జనవరి 27

నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలలో 2,60,859 మంది ఓటర్లతో తుది జాబితా విడుదల చేసినట్లు ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుజాత తెలిపారు. పట్టణంలోని 48 పోలింగ్ కేంద్రాలలో 52,877 మంది ఓటర్లు ఉండగా అందులో 25,516 మంది పురుషులు, 27,345 మంది మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. రాయదుర్గం మండలంలో 39 పోలింగ్ కేంద్రాలలో 34,099 మంది ఓటర్లలో 16,959 మంది పురుషులు, 17,137 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. కణేకల్లు మండలంలోని 63 పోలింగ్ కేంద్రాలలో 52,126 మంది ఓటర్లలో 25,696 మంది పురుషులు, 26,426 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు, డీ.హీరేహాళ్ మండలంలోని 43 పోలింగ్ కేంద్రాలలో 37,227 మంది ఓటర్లకు 18,568 మంది పురుషులు, 18,655 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని 58 పోలింగ్ కేంద్రాలలో 45,146 మంది ఓటర్లకు 22,480 మంది పురుషులు, 22,660 మంది మహిళలు, ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. గుమ్మఘట్టలో 45 పోలింగ్ కేంద్రాలకు 39,384 మందికి 19,871 మంది పురుషులు, 19,513 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గంలో 1,29,090 మంది పురుషులు, 1,31,736 మంది మహిళలు, 33 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండి 2,60,859 మంది ఓటర్లతో తుదిజాబితాను విడుదల చేసినట్లు ఆమె తెలిపారు.

రా.. కదలిరా.. సభకు తరలిన టీడీపీ నాయకులు


సభకు వెళ్తున్న పూలనాగరాజు, కార్యకర్తలు

రాయదుర్గం, జనవరి 27: రా.. కదలిరా.. బహిరంగసభకు రాయదుర్గం నియోజకవర్గం నుంచి 700 వాహనాలలో 14 వేల మంది దాకా తరలివెళ్లారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు ఉరవకొండకు తరలివెళ్లారు. జడ్పీ మాజీ చైర్మన్ పూలనాగరాజు వినాయకసర్కిల్ వద్ద నుంచి వాహనాలను తరలించారు. రాయదుర్గం నుంచి ఉరవకొండ వైపు వెళ్లే వాహనాలన్నీ కణేకల్లు వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నాయి. దీంతో హనుమాపురం వద్ద ట్రాఫిక్ జామ్ అయింది.


టీడీపీ జెండా ఊపుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గంరూరల్: రా... కదలిరా.. సభకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. మాజీ మంత్రి పరసరత్నం, నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వర యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు జెండా ఊపి వాహనాల్లో తరలివెళ్లారు.


వాహనాలను ప్రారంభిస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం: రా.. కదిలిరా సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి జెండా ఊపి వాహనాల్లో తరలివెళ్లారు.


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న వెంటశివుడుయాదవ్

గుంతకల్లుటౌన్: రా కదిలిరా బహిరంగ సభకు తిలక్‌నగర్‌లోని వెంకటశివుడుయాదవ్ స్వగృహం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెంటకశివుడు యాదవ్ జెండా ఊపి ద్విచక్రవాహనాలు, వాహనాలను ప్రారంభించారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం


సభకు వెళుతున్న టీడీపీ నాయకులు

యాడికి, జనవరి 27: రాష్ట్రంలో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని రాయలచెరువులో వేలూరు దేవేంద్రనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు శనివారం రా.... కదలిరా సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన కావాలంటే టీడీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. పరిమి శ్రీహరి, గోపాల్‌నాయుడు, రంగస్వామి, కేశవ, నెట్టికంటయ్య, మనోహర్, గోవిందప్ప తదితరులు సభకు తరలివెళ్లారు. చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగురైతు కమిటీ జిల్లా కార్యదర్శి రవికుమార్‌రెడ్డి వెళ్లారు.

లారీ, బైక్ ఢీ... యువకుడి మృతి

తాడిపత్రిటౌన్, జనవరి 27: పట్టణంలోని నంద్యాలరోడ్డులో శనివారం బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ (28) మృతి చెందినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సత్యనారాయణ గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంలో తాడిపత్రి పట్టణానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో నంద్యాలరోడ్డులోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


గుత్తి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా


రాయదుర్గంలో...

మున్సిపల్ కార్మికులు ధర్నా

గుత్తి, జనవరి 27: సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 16రోజులపాటు సమస్యల సాధన కోసం సమ్మె చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు జీఓ విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే సమ్మెకాలపు వేతనాలు చెల్లిస్తూ ఒప్పందం మేరకు జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు సూర్యనారాయణ, మహేష్, రామాంజినేయులు, సుంకన్న, రాజ్‌కుమార్, రవిశంకర్, మురళి, షరీఫ్, నాగరాజు, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

జీఓలు వెంటనే విడుదల చేయాలి

రాయదుర్గం: ఇచ్చిన హామీ మేరకు జీఓలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 రోజులు సమ్మె నిర్వహిస్తే ప్రభుత్వం చర్చలు జరిపి హామీలు ఇచ్చిందన్నారు. అయితే హామీలకు సంబధించిన జీఓలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపండి'

తాడిపత్రిటౌన్, జనవరి 27

తమ జీతాలు పెంచే విధంగా ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని మునిసిపల్ కమిషనర్ రవికి ఇంజనీరింగ్ కార్మికులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ తక్కువ వేతనానికి పని చేస్తున్నామన్నారు. ప్రస్తుత జీవో మేరకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కార్మికులు జుబేర్, ఓబయ్య, ప్రసాద్ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

తాడిపత్రిటౌన్, జనవరి 27: పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులో ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్‌ఐసీ మేనేజర్ రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల విధుల్లో ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యక్షుడు హుస్సేన్, దాదు, బాబా తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా శనివారం మండలంలోని ఎలక్ట్రీషియన్లు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డును పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం తమను గుర్తించి ప్రత్యేక పథకాలను అందించాలని కోరారు.

రైలు ఢీకొని కార్మికుడి మృతి

డీ.హీరేహాళ్, జనవరి 27: రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి పవన్‌పాల్(26) మృతి చెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన పవన్‌పాల్ రైల్వే డిపార్ట్‌మెంట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 15 రోజుల క్రితం పనినిమిత్తం బాదనహాళ్‌కు వచ్చాడు. ఈ నేపథ్యంలో శనివారం రైల్వేట్రాక్‌పై ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పనిచేస్తున్నాడు. ఎదురుగా వస్తున్న రైలును కూడా గమనించలేదు. దీంతో ప్రమాదం చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: మండలంలోని చుక్కలూరు గ్రామసమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.8750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి గంగాధర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

గుత్తి, జనవరి 27: గుత్తిఆర్ఎస్ రోడ్డులోని లక్ష్మమ్మ దేవాలయం వద్ద జరిగిన దాడి కేసులో నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి శనివారం తెలిపారు. గుత్తిఆర్ఎస్ సుందరయ్య కాలనీకి చెందిన నాగేంద్రబాబు అదే కాలనీకి చెందిన చంద్రశేఖర్, గోవర్ధన్ మధ్య గతంలో మనస్పర్ధలు ఉన్నాయి. దీంతో నాగేంద్రబాబును చంపాలనుకున్నారు. ఉదయం లక్ష్మమ్మ దేవాలయం పక్కన నాగేంద్రబాబు, అతడి హోటల్‌లో పనిచేసే హరీష్, డ్రైవర్ సురేష్ ఉండగా చంద్రశేఖర్, గోవర్ధన్, అజయ్, ప్రశాంత్ బైక్‌లలో వెళ్లి కట్టెలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. నాగేంద్రబాబు అక్కడ నుంచి పారిపోగా అడ్డువచ్చిన హరీష్‌ను గాయపరిచారు. గాయపడిన హరీష్‌ను అతడి స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్, గోవర్ధన్, అజయ్, ప్రశాంత్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విరివిగా మొక్కలు నాటాలి

- ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగప్ప

రాయదుర్గంరూరల్, జనవరి 27: భూతాపం తగ్గాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగప్ప పేర్కొన్నారు. శనివారం జాతీయ సేవ ప్రత్యేక శిబిరంలో భాగంగా నీటి నిర్వహణ, భూతాపంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి పెరుగుతున్న కాలుష్యం, భూతాపం గురించి, ఉష్ణోగ్రతల గురించి స్థానికులకు వివరించారు. మొక్కలు పెంచాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డీ నారాయణ, ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

రాయదుర్గం, జనవరి 27: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న దివాకర్‌రెడ్డిని చిత్తూరు జిల్లా నగరికి బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రెటరీగా ఉన్న షేక్‌మాలిక్‌ను రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- జేడీఏ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, జనవరి 27: కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని రాకెట్లలో శనివారం పంట నమోదు చేసిన పొలాలను పరిశీలించారు. రికార్డులలో ఉన్న పంట నమోదు వివరాలను పొలంలో పంటను సరిచూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందులు పండించిన రైతులు ప్రభుత్వానికి అమ్మితే నగదు జమవుతుందన్నారు. అవే కందులను తిరిగి రేషన్ షాపుల ద్వారా తిరిగి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శుభకర్, వీఏఏలు పాల్గొన్నారు.

పూర్ణానందస్వామి ఆలయ వార్షికోత్సవం

ఉరవకొండ, జనవరి 27: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న భువనేశ్వరీదేవి ఆలయంలో వెలసిన పూర్ణానంద స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసి మూడేళ్లైనా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సోముశేఖర్, సభ్యులు రమేష్, ఓబన్న, నాగభూషణం పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పూర్ణానందస్వామి

వైభవంగా పల్లకి సేవ

మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

- తాడిపత్రి డీఎస్పీ గంగయ్య

యాడికి, జనవరి 27: ఎన్నికల నేపథ్యంలో గొడవల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య హితవుపలికారు. శనివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలు గుడిపాడు, నిట్టూరు, వెంగన్నపల్లిలో పర్యటించారు. ఆయా గ్రామస్థులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించే వారు ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆయన వెంట యాడికి సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు ఏపీటీఎఫ్ విద్యా సదస్సు

అనంతపురం విద్య, జనవరి 27: స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో విద్యాసదస్సును ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం, ప్రస్తుతం విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులపై, స్కూళ్ల మనుగడ తదితర అంశాలపై ఇందులో చర్చిస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు చదువు అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లను బలోపేతం చేయాల్సిన ప్రథమ బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు హనుమప్ప, డేనియల్, నాగరాజు, గాయత్రీ, బొమ్మయ్య, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కళ్యాణదుర్గం, జనవరి 27: నియోజకవర్గంలోని పలు చోట్ల పౌరసరఫరాలశాఖ స్టాక్ పాయింట్లను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం కంబదూరులోని పౌరసరఫరాలశాఖ స్టాక్‌పాయింట్‌ను సాయిప్రసాద్, సీఐ రవీంద్రనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలు, రికార్డులను పరిశీలించారు. నిత్యావసర సరుకులను సకాలంలో ప్రజలకు అందేవిధంగా చూడాలన్నారు. తూకాల్లో వ్యత్యాసం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోడౌన్ ఉన్న స్టాక్‌కు, అనంతరం స్టాక్‌లో 150 కేజీల బియ్యం, 35 కేజీల రాగులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వ్యత్యాసాలపై చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరండి

- అధ్యాపక బృందం

కళ్యాణదుర్గం, జనవరి 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ప్రతి ఒక్క విద్యార్థి ఇంటర్ తర్వాత కూడా డిగ్రీ కళాశాలలోనే చేరాలని ప్రిన్సిపాల్ చిక్కబొమ్మన్న సూచించారు. శనివారం కంబదూరు జూనియర్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్‌డ్రైవ్‌పై కళ్యాణదుర్గం డిగ్రీ అధ్యాపక బృందం సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఇంటర్ పూర్తి చేసిన తర్వాత కూడా డిగ్రీకి సంబంధించి కళ్యాణదుర్గం ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివితే విజయాలు ఏ విధంగా సాధించవచ్చు జీవితంలో అత్యున్నస్థాయికి ఏవిధంగా ఎదగవచ్చు అన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శ్రీధర్, శ్యామ్ ప్రసాద్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 27: పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977-78 సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన వారు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో కలిశారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మిఠాయిలు పంచుకుని అనంతరం భోజనాలు చేశారు.



రిజర్వాయరులో నీటినిల్వ 0.447 టీఎంసీలు

బెళుగుప్ప, జనవరి 27: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 0.447 టీఎంసీలు వున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు 393 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఇక్కడి నుంచి ఫేజ్-2 కింద 300 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉందని అధికారులు వెల్లడించారు.

ప్రశ్నించే వారేరి?

మండల సర్వసభ్య సమావేశం తీరిది

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 27: మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించే వారే కరువయ్యారు. శనివారం సమావేశం జరగ్గా ఆయా శాఖల అధికారులు నామమాత్రంగా పనుల గురించి వివరిస్తే ప్రజాప్రతినిధులు మౌనం పాటించారు. నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రశ్నించలేదు. సమావేశంలో ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, యూఆర్‌డీ హరికృష్ణ, బాలాజీ, ఇతర శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాఫీగా సర్వసభ్య సమావేశం

గుత్తిరూరల్, జనవరి 27: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ విశాలక్షి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ శివాజీరెడ్డి, సర్పంచులు రమేష్‌నాయుడు, వెంకటేష్, ఎంపీటీసీలు జింకల నారాయణస్వామి, ధనుంజయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిరండి

పెద్దవడుగూరు, జనవరి 27: మండలకేంద్రంలో ఆదివారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నిర్వహించనున్న యువచైతన్య బస్సుయాత్రకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కందిపంట దగ్ధం

పెద్దపప్పూరు, జనవరి 27: మండలంలోని చీమలవాగుపల్లి గ్రామంలోని రైతు రంగన్నకు చెందిన కందిపంటను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. 4.5ఎకరాల్లో కందిపంటను రంగన్న సాగుచేశాడు. పంట చేతికి రావడంతో ఈనెల 23న కో త కోసి కుప్పగా ఉంచాడు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.1.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రై తు తెలిపాడు. ఎస్‌ఐ శరత్ చంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'సదస్సును జయప్రదం చేయండి'

రాయదుర్గంరూరల్, జనవరి 27: వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కొట్రేష్ కోరారు. శనివారం పట్టణంలో ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా సదస్సు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తాలూకా కార్యవర్గ సభ్యులు యోగేంద్ర, నాయకులు తేజ, వంశీ, రాజు, శివ, భగవత్, హరి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడూ బిల్లులు కట్టించుకుంటాం: డీఈఈ

తాడిపత్రిటౌన్, జనవరి 27: విద్యుత్ బిల్లుల వసూలుకు ఆదివారం సెలవుదినం అయినప్పటికీ కట్టించుకోవడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

నేడు టాలెంట్ టెస్టు

కుందుర్పి, జనవరి 27: ప్రభుత్వబడుల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడానికి ఎస్కే చారిటబుల్ ట్రస్టు, వదాన్య జనసొసైటీ ఆధ్వర్యంలో శ్రీనివాసరామానుజన్ జ్ఞాపకార్థం ఆదివారం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు లెనిన్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా 700 మంది రిజిస్టర్ చేసుకున్నారని, వారు హాల్‌టికెట్లు తీసుకుని ఉదయం 9.30 గంటలకు కుందుర్పిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు టెస్టు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిభకనబరచిన వారికి ఫిబ్రవరి 5న బహుమతులు అందజేస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

పెద్దపప్పూరు, జనవరి 27: మండలంలోని ముచ్చుకోట గ్రామసమీపంలో శనివారం వరదాయపల్లికి చెందిన పవన్‌లో బైక్‌లో వెళుతూ అదుపుతప్పి పడ్డాడు. దీంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పవన్‌ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్‌ఐ బదిలీ

యల్లనూరు, జనవరి 27: మండల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ధరణీబాబు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని డీఐజీ అమ్మిరెడ్డి బదిలీ చేశారు. యల్లనూరు ఎస్‌ఐగా చిత్తూరు నుంచి గిరిబాబు నియమితులైనట్లు తెలిసింది.